తీరంలో కాంక్రీట్ కట్టడాలు కూల్చివేత

- విజయసాయిరెడ్డి కుమార్తెవని చర్చ

తీరంలో సాగుతున్న కూల్చివేత పనులు

ప్రజాశక్తి- భీమునిపట్నం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా భీమిలి సాగర తీరాన సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన కాంక్రీట్ కట్టడాలను జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో శనివారం మళ్లీ కూల్చివేశారు. ఆ కట్టడాలు వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి కుమార్తె నేహా రెడ్డివని భావిస్తున్న నేపథ్యంలో స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ కట్టడాల విషయమై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఈ ఏడాది ఫిబ్రవరి 23న హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సుమారు నాలుగు ఎకరాల స్థలంలో స్టార్ హోటల్ నిర్మాణానికి నేహారెడ్డి పూనుకున్నారని ఆయన ఈ వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఈ పిల్‌పై హైకోర్టు ఆదేశాలతో రెండు వారాల క్రితమే జివిఎంసి అధికారులు కూల్చివేతలు మొదలుపెట్టారు. అయితే, అవి ఇటీవల ఆగాయి. కట్టడాలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేయాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో జివిఎంసి అధికారులు ఆ దిశగా మళ్లీ చర్యలు చేపట్టారు.

పిన్నెల్లి పిఎ శ్రీనివాసశర్మ కిడ్నాప్, విడుదల

ప్రజాశక్తి- మాచర్ల (పల్నాడు జిల్లా)

మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్సనల్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసశర్మను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నల్ల రంగు స్కార్పియో వాహనంలో పట్టణంలోని ఆయన నివాసానికి వచ్చారు. ముందుగా ఇద్దరు ఇంట్లోకి ప్రవేశించారు. తరువాత మరో నలుగురు ఇంట్లోకి ప్రవేశించి శ్రీనివాసశర్మతో కొద్దిసేపు మాట్లాడారు. ఆ తర్వాత బలవంతంగా స్కార్పియో వాహనంలో తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసశర్మ కుటుంబ సభ్యులను రూరల్ సిఐ హఫీజ్‌బాషా విచారించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి 8 గంటలు దాటిన తరువాత శ్రీనివాసశర్మ గాయాలతో ఇంటికి చేరుకున్నారు. పిన్నెల్లి ప్రత్యర్థులే ఆయనపై దాడి చేసినట్లు తెలిసింది. కిడ్నాప్ చేసిన తరువాత కొట్టి విడిచిపెట్టినట్లు పోలీసులకు శర్మ కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. గత 20 ఏళ్లుగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వద్ద పిఎగా శర్మ పనిచేస్తున్నారు.

హైదరాబాద్‌లో భారీ వర్షం

హైదరాబాద్: హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సికింద్రాబాద్, తార్నాక, నాచారం, ఉప్పల్, రామంతాపూర్, మేడిపల్లి, కోఠి, చిక్కడపల్లి, ముషీరాబాద్, ఎల్‌బినగర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఐటీ కారిడార్‌తోపాటు సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్‌బినగర్ తదితర ప్రాంతాల్లో వాహనాలు బారులు తీరాయి. అత్యధికంగా ఖైరతాబాద్‌లో ఎనిమిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోల్కొండలో 7.3, ఆసిఫ్‌నగర్‌లో 7.1, మెహదీపట్నంలో 6.4, సికింద్రాబాద్‌లో 5.8, నాంపల్లి, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో 5 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

సమావేశంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామస్వామి, వైటి దాసు, జె అయోధ్యరామ్, గుర్తింపు సంఘం (ఎఐటియుసి) నాయకులు డి అదినారాయణ

ఉక్కు కార్మిక సంఘాల నేతలతో సమావేశమైన స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎమ్‌డి అరుణ్ కుమార్ బాగ్చి

అక్టోబర్ నుంచి ఫర్నేస్-2లో ఉత్పత్తి

- స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎమ్‌డి అరుణ్ కుమార్ బాగ్చి
- ఉక్కు కార్మిక సంఘాలతో సమావేశం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

అక్టోబర్ నెలాఖరుకు రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని స్టీల్‌ప్లాంట్ ఇన్‌ఛార్జ్ సిఎమ్‌డి అరుణ్ కుమార్ బాగ్చి తెలిపారు. శనివారం ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలతో ఆయన సమావేశమయ్యారు. ప్లాంట్‌ను మూసివేస్తారన్న దానిలో వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుతానికి కేంద్రం నుంచి రూ.500 కోట్లు మంజూరయ్యాయని, ఆ డబ్బులతో జిఎస్‌టి కట్టామని చెప్పారు. ఇంకా నిధులు రానున్నాయని, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అన్ని యూనియన్ల నాయకులు ఉక్కు యాజమాన్యంతో పలు అంశాలపై చర్చించారు. ప్లాంట్ ఉత్పత్తిలో మొదటి నుంచి కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని, వారికి ఎప్పటికప్పుడు ప్లాంట్‌లో ఏం జరుగుతుందో హెచ్‌ఆర్ డిపార్టుమెంట్ తెలియజేయాలని కోరారు. యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు తెలియక మొత్తం కార్మికవర్గం ఆందోళనకు గురవుతోందన్నారు. ఆరు నెలలుగా ఉద్యోగుల పే స్లిప్‌లో కట్ చేసిన పిఎఫ్, ట్రిప్ట్ ఫండ్, ఎస్‌ఎబిఎఫ్‌లను ముందుగా జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు నగరంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. 2019 నవంబర్ నుంచి ఉద్యోగ నియామకాలు నిలిపివేశారని, ఇప్పుడు ఉన్న కార్మికులతో బ్లాస్ట్ ఫర్నేస్ 3ను నడిపించడం కష్టమని తెలిపారు. ఈ నేపథ్యంలో రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరపకుండా, ఇప్పటికే పని చేస్తున్న ఉద్యోగులను విఆర్ఎస్, డిప్యుటేషన్ పేర్లతో బయటకు పంపితే ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఉక్కు ఉద్యోగులకు జీతాలు నెల మొదటి తేదీనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ సిఎమ్‌డి మాట్లాడుతూ ఈ నెలలో ఉద్యోగుల మిగిలిన సగం జీతం 23న చెల్లిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కెఎస్ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, ఎన్.రామచంద్రరావు, విల్లా రామ్మోహన్ కుమార్, వి.శ్రీనివాసరావు, రామ్ కుమార్, బి.డేవిడ్, లక్ష్మణరావు, నరేంద్ర కుమార్, సురేష్ బాబు, కె.శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల కోసం కన్సల్టేటివ్ ఫోరం

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- సిఐఐ సమావేశంలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేయనున్నట్లు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వారం రోజుల్లో వస్తాయని తెలిపారు. విజయవాడలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) ఆధ్వర్యాన నిర్వహించిన సదరన్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో శనివారం పాల్గొని లోకేష్ మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇందుకు కావాల్సిన రాయితీలు ఇవ్వడంతోపాటు మౌలిక సౌకర్యాలు, ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెట్టుబడులు పెట్టించేందుకు ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో తీసుకున్న పిపిఎల రద్దు నిర్ణయం వల్ల రాష్ట్రంతో పాటు దేశం కూడా నష్టపోయిందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధిలో సిఐఐ కీలకపాత్ర పోషించాలని కోరారు. విశాఖను ఐటి హబ్‌గా రూపొందించడంతోపాటు డేటా సెంటర్, ఎఐ యూనివర్సిటీని నెలకొల్పుతామని చెప్పారు. ఆయా జిల్లాల్లో ఉన్న వనరుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. నూతన ఆలోచనలతో ముందుకెళ్తున్నామని, ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండా అని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న విస్తృత అవకాశాలను సిఐఐ ప్రతినిధులకు వివరించారు.

'ఉక్కు' ఉద్యోగుల అలవెన్స్‌లు నిలిపివేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉక్కు ఉద్యోగులందరికీ ఎల్‌టిసి / ఎల్‌ఎల్‌టిసి / ఎల్‌టిఎతో పాటు ఇంటి అద్దె భత్యం చెల్లింపులు నిలిపివేస్తున్నట్లు ఉక్కు యాజమాన్యం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. అధికారులు పొందుతున్న ముందస్తు అలవెన్స్‌లను గ్రేడ్‌ల ప్రకారం 12 శాతం, ఆరు శాతానికి తగ్గించేసింది. ఆగస్టు 2024 నుంచి పై నిర్ణయాలు అమలులోకి వచ్చేలా కాంపిటెంట్ అథారిటీ ఆమోదంతో ఆదేశాలు జారీ చేసినట్లు ఉక్కు యాజమాన్యం తన ప్రకటనలో తెలిపింది.

దారుణమైన నిర్ణయం : స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్

కార్మికుల అలవెన్స్‌లను నిలిపివేస్తూ ఉక్కు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఖండించారు. కార్మికులను ఉత్తేజపరిచే నిర్ణయాలతో ఉత్పత్తి పెరుగుతుంది తప్ప హక్కులను, వేతనాలను, అలవెన్స్‌లకు కోత విధించడం వల్ల కాదని తెలిపారు. ప్లాంట్ యాజమాన్యం తీరుమార్చుకోకుంటే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

కొనసాగుతున్న 'లడ్డూ లడాయి'

- నేటి నుంచి పవన్ ప్రాయశ్చిత దీక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

శ్రీవారి లడ్డూలో వినియోగించే నెయ్యి నాణ్యతపై లడాయి కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు (టిటిడి) ప్రసాదం విషయంలో వివాదం చెలరేగిన నేపథ్యంలో అందుకు ప్రాయశ్చిత్తంగా తాను దీక్ష చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీదశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి 11 రోజుల పాటు ఆయన ఈ దీక్ష చేయనున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకుల వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైందని తెలిసి తాను తీవ్ర వేదనకు గురయ్యానని తెలిపారు.

విచారణ జరపండి : బొత్స

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నాణ్యత లేని పదార్థాలు వాడారని సిఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానని, లడ్డూ వ్యవహారంపై విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని వైసిపి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విచారణ అనంతరం తప్పు జరిగిందని తెలిస్తే ఎంతటి వారినైనా శిక్షించాలన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో కమిటీ వేసి విచారణ జరపాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై ఏర్పాటు చేసిన రాజకీయ ప్రసంగంలో లడ్డూపై అసత్యాలు మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. జగన్‌పై కక్ష తీర్చుకోవడానికే చంద్రబాబు ఈ ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆక్షేపించారు. టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజులు మౌనంగా ఉండి వైఎస్ జగన్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని వివాదం చేస్తోందన్నారు. ఎన్‌డిడిబి నివేదికను టిడిపి కార్యాలయంలో ఎలా రిలీజ్ చేస్తారని నిలదీశారు.

గవర్నరుకు కాంగ్రెస్ వినతి

తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందనే అంశంపై సిబిఐతో విచారణ చేయించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వైఎస్ షర్మిల నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, మాజీ ఎమ్మెల్యేలు మస్తాన్‌వలి, ఆమంచి కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాస్‌రెడ్డి.. రాజ్‌భవన్‌లో శనివారం గవర్నరు అబ్దుల్ నజీర్‌ను కలిశారు. సిబిఐతో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. జులై 23న ల్యాబ్ రిపోర్టు వస్తే సిఎం చంద్రబాబు ఇంతకాలం ఎందుకు దాచారని ప్రశ్నించారు. కల్తీ జరిగింది వైసిపి పాలనలోనేనని, తక్కువ కోడ్ చేసిన కంపెనీకి ఎందుకు కాంట్రాక్టు ఇచ్చారని వైసిపి నేతలను షర్మిల ప్రశ్నించారు. ఒక ప్రాంతీయ పార్టీ తమ ఆర్థిక ప్రయో జనాలకు తిరుమల లడ్డూను వాడుకుందని, మరో ప్రాంతీయ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విమర్శించారు.

శ్రీవారి ఆలయ సంప్రోక్షణ

శ్రీవారి ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని టిటిడి నిర్ణయించింది. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు శాంతియాగాన్ని జరపనుందని విశ్వసనీయ సమాచారం.

అన్నవరం టూ హైదరాబాద్

- హాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- 2.3కిలోల హాష్ ఆయిల్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం
- మరోచోట చాక్లెట్స్‌గా గంజాయి సరఫరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరం నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్‌ను సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురిని ఎల్‌బినగర్ ఎస్ఒటి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 2.3 కిలోల హాష్ ఆయిల్, ఐదు సెల్‌ఫోన్లతోపాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎల్బీనగర్ సిపి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిపి సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. సైదాబాద్ టెలికాం క్వార్టర్స్‌లో నివాసముంటున్న వి.రంజిత్‌కుమార్, మీర్‌పేట్ తిరుమళా ఎస్టేట్‌వేకు చెందిన బి.సాయి నితిన్, బి.నరేంద్ర, ఎల్‌బినగర్‌కు చెందిన బి.సాయి కృష్ణ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో విశాఖపట్నం వెళ్లి గంజాయి, హాష్ ఆయిల్, డ్రగ్స్ దందా నిర్వహించే సాయిని కలిశారు. సాయి నుంచి హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి తిరిగి హైదరాబాద్‌కు వస్తున్న క్రమంలో కొద్ది రోజుల కిందట సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. తొమ్మిది రోజుల అనంతరం బయటకు వచ్చిన తర్వాత తిరిగి హాష్ ఆయిల్ సరఫరా చేయాలని అన్నవరం వెళ్లారు. అక్కడ సాయి వద్ద ఐదు గ్రాములకు రూ.రెండు వేల చొప్పున 2700 గ్రాముల హాష్ ఆయిల్ కొనుగోలు చేశారు. గుట్టుచప్పుడు కాకుండా హైదరాబాద్ తీసుకొచ్చి మీర్‌పేట్‌లోని సాయి నితిన్ ఇంట్లో దాచిపెట్టారు. చిన్నచిన్న బాటిళ్లలో హాష్ ఆయిల్‌ను నింపి సరఫరా చేసేందుకు ప్రయత్నించారు. కిలో హాష్ ఆయిల్ తయారు చేయాలంటే 35 నుంచి 40 కేజీల గంజాయిని నిందితులు ఉపయోగిస్తారని సిపి తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు సాయి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామన్నారు.

సిఎస్‌కె పరిశ్రమలో దెబ్బతిన్న యంత్రాలు, ముడి పదార్థాలు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవడానికి, పాలసీలులేని వారు కంపెనీల నిర్వహణకు అవసరమైన రుణాలు సమకూర్చుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. బీమా కంపెనీల వారు క్లెయిమ్‌లు, బ్యాంకర్లు రుణాలు అందిస్తే 30 నుంచి 45 రోజుల్లో పరిశ్రమలను తిరిగి తెరుస్తామని, లేకపోతే ప్రయివేటు అప్పులే దిక్కవుతాయని చెప్తున్నారు. దీంతో, అప్పుల భారం పెరగడంతోపాటు పరిశ్రమలు

చిన్న పరిశ్రమలు చిన్నాభిన్నం

తెరవడానికి రెండు నెలలకుపైగా సమయం పడుతుందని పరిశ్రమల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

కార్మికులపై ప్రభావం

విజయవాడ ఊర్మిళా నగర్, ఏకలవ్య నగర్ తదితర ప్రాంతాలకు చెందిన 1500 మంది కబేళా ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమలు దెబ్బతినడంతో ఆ కార్మికులకు ఉపాధి పోయింది. ప్రస్తుతం కేవలం పరిశ్రమల క్లీనింగ్‌కు 500 మంది కార్మికులను మాత్రమే పిలుస్తున్నారు. మిగిలిన వెయ్యి మంది కార్మికులకు పనిలేకుండా పోయింది. పరిశ్రమలు ఉత్పత్తులు ప్రారంభిస్తేగానీ వారికి పూర్తి స్థాయిలో పనులు కల్పించలేమని పరిశ్రమల యజమానులు చెబుతున్నారు.

అన్న క్యాంటీన్లకు పార్టీ రంగులపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

అన్న క్యాంటీన్ బిల్డింగులకు అధికార తెలుగుదేశం పార్టీ జెండా రంగులు వేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. 'అన్న క్యాంటీన్లతో సహా ప్రభుత్వ భవనాలకు టిడిపి జెండా రంగులు వేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పసుపు, ఎరుపు రంగులను వాడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు' అని ఎపి ఎన్‌జిఒల సంఘం పూర్వ అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్ రెడ్డి పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వ నిధులతో టిడిపి జెండా రంగులు వేస్తున్నారని అన్నారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు అవే రంగులు ఉపయోగించాలని యోచిస్తున్నారని చెప్పారు. సిఎం చంద్రబాబు, మంత్రి పి నారాయణ మౌఖిక ఆదేశాల కారణంగానే టిడిపి జెండా రంగులు వేశారన్నారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులను ప్రతివాదులుగా చేశారు. చంద్రబాబు, నారాయణను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా పేర్కొ న్నారు.

ఆయుధాలను వెనక్కిప్పించండి

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పుడు స్వాధీనం చేసిన తన ఆయుధాలను పోలీసులు వెనక్కివ్వడం లేదంటూ పుంగనూరు వైసిపి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో తాను పోలీసులకు స్వాధీనం చేసిన 0.32 బోర్ పిస్టోల్, 22 రివాల్వర్,

నేడు ఏచూరి సంతాపసభ

- ఎంఎ బేబీ, బివి రాఘవులు హాజరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల మరణించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాపసభ ఆదివారం ఉదయం విజయవాడలో జరగనుంది. ఉదయం 10 గంటలకు మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే ఈ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, బివి రాఘవులు హాజరు కానున్నారు. వీరితోపాటు టిడిపి నేత, రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పాల్గొంటారు. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీరం రమేష్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి బి బంగార్రావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్‌బాబు పాల్గొంటారు. ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, ఆర్ఎస్‌పి నాయకులు జానకిరాములు, ఫార్వార్డ్‌బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఎస్‌యుసిఐసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్ అమర్‌నాథ్ పాల్గొంటారు. తెలుగుదేశం, జనసేన తదితర రాజకీయ పార్టీల నాయకులూ పాల్గొని నివాళులర్పించనున్నారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించనున్నారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - కాజులూరు(కాకినాడ జిల్లా)

చెరువులను జెసిబితో ధ్వంసం చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఆక్వా చెరువులను నిర్వహిస్తున్నారని పేర్కొంటూ వైసిపి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చెందిన చెరువులను అధికారులు శనివారం ధ్వంసం చేశారు. అక్కడి భూములను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెంలో 9.45 ఎకరాలను తోట త్రిమూరులు 16 ఏళ్ల క్రితం కొనుగోలు చేశారు. వీటిని ఆక్వా చెరువులుగా మార్చారు. అయితే, ఇవి లాండ్ సీలింగ్ భూములంటూ మూడేళ్ల క్రితం జనసేన నేత లీలాకృష్ణ ఆరోపణ చేశారు. దీనిపై కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద చెరువులను శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో కాకినాడ డిఎస్‌పి, ఆర్‌డిఒ ఆధ్వర్యంలో రెవెన్యూ పోలీస్, అగ్నిమాపక సిబ్బంది నాలుగు జెసిబిలతో ధ్వంసం చేశారు. కాకినాడ డిఎస్‌పి రఘువీర్‌విష్ణు, కాకినాడ రూరల్ సిఐ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందించారు. ఇవి పట్టాభూములని, దీనికి సంబంధించి అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. గోడకు నోటీసు అంటించి తెల్లవారుజామునే ధ్వంసం చేయడం సరికాదన్నారు. అధికారులు ఎవరి మెప్పు పొందడం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రశ్నించారు.

జూలై వరకు రు. 37 వేల కోట్ల రుణం

- రిజర్వ్‌బ్యాంకు నెలవారీ బులిటెన్‌లో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ ఏడాది జులై నెల వరకు రాష్ట్ర ప్రభుత్వం రు.37 వేల కోట్ల రూపాయలను రుణంగా సేకరించింది. ఈ మేరకు రిజర్వ్‌బ్యాంకు నివేదికను విడుదల చేసింది. ఆగస్టు నెలకు సంబంధించిన ఈ బులిటెన్‌లో మే, జూన్, జూలై నెలలకు మొత్తం 2.14 లక్షల కోట్లను రుణాలుగా అన్ని రాష్ట్రాలకు అందించగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రు.37 వేల కోట్ల రూపాయలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.రెండో స్థానంలో తమిళనాడు రాష్ట్రం రు. 33 వేల కోట్లతో ఉంది.

ఆర్‌బిఐ గణాంకాల మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ 57,478 కోట్లు మార్కెట్ రుణాలుగా సేకరించగా, 2023-24 సంవత్సరంలో 68,400 కోట్లు సేకరించినట్లు రిజర్వ్‌బ్యాంకు ప్రకటించింది. అంటే గత ఏడాది 12 నెలల్లో తీసుకున్న రుణంలో 50 శాతానికిన్నా ఎక్కువగా ఈ ఏడాది జూలై వరకు తీసుకున్నట్లు ఆర్‌బిఐ లెక్కల ద్వారా తేలింది. అత్యధికంగా ఈ రుణాలను ఉపయోగించుకున్న రాష్ట్రాల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉండగా, పంజాబ్ 25,500 కోట్లతో మూడో స్థానంలో ఉండగా, మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 21వేల కోట్లతో నాలుగో స్థానంలో ఉన్నాయి.

రూ.70 కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో సిసిఎస్ సొసైటీకి చెల్లించకుండా సుమారు రూ.70 కోట్లు పెండింగ్ పెట్టారని, వెంటనే వడ్డీతోపాటు పెండింగ్ మొత్తాన్ని కూడా ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండులో ఎపిఎస్ఆర్‌టిసి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ (సిసిఎస్)కి చెందిన డెలిగేట్లతో శనివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడ బస్టాండులో సిసిఎస్ ఎంక్వైరీ కౌంటర్ గతంలో మాదిరి ఏర్పాటు చేయాలన్నారు. సిసిఎస్ మేనేజింగ్ కమిటీ గతంలో జరిగిన సిసిఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగులకు షూరిటీలు లేకుండా రుణాలు మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న లోన్లతో పా